# మహాత్మ జోతిరావ్ పూలే అధ్యయన కేంద్రం

# MAHATMA JOTHIRAO PHULE CENTRE

***for Studies in Social Philosophy and Social Action***




## ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

నాగార్జుననగరు–522 510, గుంటూరు, ఆంధ్రప్రదేశ్

Ph: 0863-2346473(O), Mobile: 9490175786

మహారాష్ట్రలో శూద్రకులంలో పుట్టి, కులవివక్షని చవిచూసిన మహాత్మ జోతిరావ్ ఫూలే (1827-1890) భారతదేశమే గర్వించదగ్గ సామాజిక విప్లవ పితామహుడిగా గుర్తించబడ్డారు. కులవ్యవస్థ, పురుషాధిపత్య వ్యవస్థల నిర్మూలన కొరకు జీవితాంతం రాజీలేని పోరాటం నడిపిన మేధావి, తాత్వికుడు ఫూలే.

అవిద్యే శూద్ర, అతిశూద్ర జాతుల అణిచివేతకీ, వెనుకబాటుకీ కారణమని గ్రహించి, వారి కొరకు పాఠశాలల్ని ప్రారంభించిన తొలి విద్యాప్రదాత ఫూలే. తన జీవిత సహచరిణి సావిత్రిభాయి ఫూలేకు స్వయంగా చదువు నేర్పి ఆమెను ఉపాధ్యాయురాలిని చేసి తద్వారా అన్ని కులాల మహిళలకు తొలిబడి ఏర్పాటు చేసిన ఘనత ఫూలేకే దక్కుతుంది. మనిషి మత భావాలకు, దాశ్యానికి గురికాకుండా సత్యాన్ని అన్వేషించాలని, దానికొరకు ఏ మతగ్రంథాలూ, మధ్యవర్తులు, పూజారులు అవసరంలేదనీ, మనిషి ఆత్మగౌరవానికి పట్టం కట్టిన హేతుజ్ఞాని ఫూలే. ఆ ధ్యేయంతోనే 'సత్యశోధక్ సమాజ్' అనే సంస్థను 1873లో స్థాపించారు. బానిస భావజాలాన్ని వీడి పీడిత శూద్ర జాతి విముక్తి పథంలో పయనించాలనే మహత్తర సందేశంతో, 'గులాంగిరి' అనే సుప్రసిద్ధ గ్రంథాన్ని రచించారు. నల్లజాతి ప్రజల్ని బానిసత్వం నుండి విడుదల చేసిన అమెరికా ప్రజలకు ఆ గ్రంథాన్ని అంకితం చేయడం ద్వారా తన గమ్యము, గమనాలేమిటో ప్రపంచానికి చాటారు ఫూలే.

"జోతిరావ్ ఫూలే ఆలోచన విప్లవాత్మకమైనది. అది వ్యక్తిగతస్వేచ్ఛ, వ్యక్తిగత లక్ష్యాల సాధనకు, సంపూర్ణ

సమానత్వానికి, సామాజిక ఐక్యతని సాధించడానికి ఒక స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించింది... మరే ఇతర సంస్కర్తలూ ఇటువంటి ఆలోచనను ఇవ్వలేకపోయారు" అంటూ పూలేపై నిశిత పరిశీలన చేసిన గెయిల్ ఆంవెత్ స్పష్టీకరించారు. ఈ సత్యాన్ని ఆనాడే గ్రహించిన భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గౌతమబుద్ధుని తరువాత మహాత్మపూలేనే తన తాత్వికగురువుగా ప్రకటించుకోవడం విశేషం.

కుల-వర్గ దోపిడీలకు నిలయమైన భారతదేశంలో ప్రజాస్వామ్య విలువలకు కనీస స్థానం లేకుండాపోయింది. రాజ్యాంగ విలువలైన సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయాలకు కులవ్యవస్థ నిలవెత్తు సమాధిని నిర్మించింది. ఫలితంగానే, దేశంలోని అత్యధిక ప్రజలు సాంఘిక వివక్షకు, ఆర్థిక దోపిడీకి, రాజకీయ వెలివేతకూ గురైనారు. దళిత, బహుజనులు సామాజిక న్యాయం, రాజ్యాధికార సాధన దిశలో ఉద్యమిస్తున్నారు.

ఇలాంటి చారిత్రక దశలోనే విశ్వవిద్యాలయాలు స్పందించాలి. ప్రజలకు సరైన దిశానిర్దేశం చేసే దిక్సూచిగా ముందుకురావాలి. కులనిర్మూలన ఎలా సాధ్యం? స్త్రీ-పురుష సమానత్వం కోసం ఏం చెయ్యాలి? పీడితులకు రాజ్యాధికారము, సమాన అవకాశాలు కల్పించే సమాజాన్ని ఎలా సాధించవచ్చు? ఇత్యాధి కీలకఅంశాలపై ఇప్పటికే లోతైన విశ్లేషణలు, సిద్ధాంతాలు, సాహిత్య వ్యాసంగాలు చాలానే వెలువడ్డాయి. తీవ్రమైన భావసంఘర్షణ, మేధోమదన పరంపర సాగుతూనే ఉంది. భిన్న స్వరాలు, భిన్న ధోరణులు ప్రజల్ని

ఆలోచింపచేసేవిగా ఉన్నాయి. ఐనా అధ్యయనానికి క్రమమే ఉంటుంది కాని అంతం లేదు కదా? అందుకే పూలే కేంద్రం అవతరణ.

పూలే అధ్యయన కేంద్రం భిన్న ఆలోచనలకు, వినూత్న పరిశీలనలకు, శాస్త్రీయ విశ్లేషణలకు, చర్చలకు ఒక వేదికకావాలన్నదే లక్ష్యం. మహాత్మాపూలే స్వప్నించిన కులరహిత, వివక్షారహిత సమసమాజ నిర్మాణాన్ని ఆహ్వానించే ప్రగతిశీల మేధావులు, విద్యార్థులు, కార్యకర్తల విలువైన భాగస్వామ్యాన్ని ఈ వేదిక ప్రోత్సహిస్తుంది. మహాత్మపూలే ఆలోచనను, సిద్ధాంతాల్ని, సాహిత్యాన్ని ప్రజల్లోకి తీసికెళుతుంది. సమానత్వ సాధన దిశలో కార్యోన్ముఖుల్ని చేస్తుంది.

ఎన్నో అధ్యయన కేంద్రాలకు ఆలవాలమైన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, పూలే పేరిట ఒక అధ్యయన కేంద్రాన్ని తన సొంత నిధులతోనే ప్రారంభించడం ముదావహం. దళిత, బహుజనుల ఈ చిరకాల కోరికను సాకల్యం చేసి తమ విజ్ఞతను ప్రదర్శించుకున్న గౌరవ అకడమిక్ సెనేట్ సభ్యులను, సూత్రధారి, స్ఫూర్తిప్రదాత, ఉపకులపతి ఆచార్య కోదాటి వియ్యన్నరావును పీడిత సమాజం సదా స్మరిస్తుంది.

నవంబరు 18, 2014
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

ప్రొఫెసర్ అబ్దుల్ నూర్‌బాషా
సంచాలకుడు
మహాత్మ జోతిరావ్ పూలే అధ్యయన కేంద్రం